# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 157 22-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

Contacts

తెలంగాణ

94911 34365


## ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం..

- బాబా రామ్‌దేవ్‌తో కలిసి చంద్రబాబు, లోకేశ్ యోగాభ్యాసం
- రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా యోగా సాధన
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతామని సీఎం ప్రకటన
- ఆగస్టు 15 నుంచి 'సంజీవని' ప్రాజెక్ట్ అమలు
- స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో శాశ్వత యోగా మందిరాల నిర్మాణం



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహించిన యోగా వేడుకలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌తో కలిసి సామూహిక యోగాభ్యాసంలో పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో బాబా రామ్‌దేవ్‌తో కలిసి యోగా చేయడం ఎన్నటికీ మరువలేని అనుభూతిని ఇచ్చిందని ఈ సందర్భంగా సీఎం హర్షం వ్యక్తం చేశారు. యోగాకు అంతర్జాతీయ స్థాయిలో అపారమైన గుర్తింపు తెచ్చి, నేడు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 190 దేశాల్లో ఈ ఉత్సవాలు నిర్వహించేలా చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మోదీ

- మిగతా 2వ పేజీలో



## యోగాతో ప్రపంచ శాంతి

- సమతుల్య వ్యక్తిగత జీవనశైలికి యోగా అవసరం
- యోగాను కేవలం నిర్దిష్ట రోజుకు లేదా ఒక కార్యక్రమానికి పరిమితం చేయొద్దు
- అన్ని వయసులవారూ యోగాసనాలు అభ్యసించాలి
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ పిలుపు

కోల్‌కతా: వ్యక్తిగత ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా, ప్రపంచ శాంతికి బాటలు వేయడంలో యోగా ఒక గొప్ప ఉత్ప్రేరకంగా పని చేయగలదని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సమాజంలో సామూహిక శాంతి, ప్రజల మధ్య సామరస్యాన్ని పెంపొందించే లక్షణం యోగాలో ఉందని వివరించారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో ఆదివారం నిర్వహించిన 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

- మిగతా 2వ పేజీలో

## భారత నౌకాదళానికి కొత్త బలం

అగ్రయ్, దునగిరి, సంశోధక్ ప్రవేశం

మూడు కీలక నౌకలను నౌకాదళానికి అంకితం చేసిన మోదీ

2లో

## ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

**మెట్రో అనుమతులపై కేంద్రంతో తేల్చుకునేందుకు సిద్ధం**

**ఎస్‌బీఐ భూవివాదంపై ఆర్థిక మంత్రికి ఫిర్యాదు చేసే అవకాశం.. హైకమాండ్‌తో మంతనాలు**



న్యూఢిల్లీ: రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టారు. ఆదివారం రాత్రి ముంబై మీదుగా హస్తినకు చేరుకున్నారు. రెండు రోజుల పాటు ఇక్కడే ఉండి కేంద్ర మంత్రులతో కీలక చర్చలు జరపనున్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్--2 విస్తరణ, పెండింగ్ రైల్వే ప్రాజెక్టులపై కేంద్రంతో నేరుగా తేల్చుకోవాలని ఆయన భావిస్తున్నారు. మెట్రో రైలు పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రేవంత్ ఇప్పటికే లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నెల 22, 23 తేదీల్లో నేను ఢిల్లీలోనే అందుబాటులో ఉంటాను. మీరు చొరవ తీసుకుని రైల్వే మంత్రితో సమావేశం ఏర్పాటు చేయండి'అని రేవంత్ లేఖలో కోరారు. అలాగే, రాయదుర్గంలో ఎస్‌బీఐ భూమి వేలం వివాదానికి సంబంధించి రేవంత్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసే అవకాశం ఉంది. ఈ భేటీలో ఎస్‌బీఐ ' చైర్మన్‌పై ఆయన ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. ప్రభుత్వపరమైన పనులతోపాటు, రాష్ట్ర రాజకీయాలపైనా సీఎం దృష్టి సారించనున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలను కలవనున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ, పార్టీ రాజకీయ పరిణామాలపై వారితో చర్చించే అవకాశం ఉంది.

## పై కుట్ర చేయాల్సిన అవసరం పార్టీలో ఎవరికీ లేదు

**వంచనలో భాగంగానే భాజపా మూడో అభ్యర్థిని నిలిపింది: మీనాక్షి**



హైదరాబాద్: రాజ్యసభ ఎన్నికల్లో తన నామినేషన్ తిరస్కరణకు గురయ్యేలా కాంగ్రెస్‌లో ఎలాంటి కుట్రా జరగలేదని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ స్పష్టంచేశారు. పార్టీలో తనపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికీ లేదన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి సచిన్ సావంత్‌లతో కలిసి ఆదివారం ఆమె గాంధీభవన్‌లో

- మిగతా 2వ పేజీలో

## ఒప్పందానికి రాకపోతే ఖబడ్దార్

- హోర్ముజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటాం
- అక్కడ నౌకలపై సుంకాలు విధిస్తాం
- ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక



2లో



2లో

## యోగా నాకు చాలా ఇచ్చింది

- యోగతోనే తనకు లోతైన స్పష్టత, పరిపక్వత లభించాయని చెప్పిన పవన్ కల్యాణ్
- తన దినచర్యలో క్రియ యోగ, అష్టాంగ యోగ అంతర్భాగమని వెల్లడి
- యోగాకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు



## భయపడకండి.. అండగా ఉంటాం

- అధికారంలోకి వచ్చిన వెంటనే బస్తీవాసులందరికీ పట్టాలు
- మూసీని అడ్డుపెట్టుకుని బస్తీని ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం కుట్ర
- ఎన్ని కుట్రలు చేసినా న్యాయం జరిగే దాకా పోరాడుతాం
- హనుమాన్‌నగర్‌వాసులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా
- బస్తీ బాటకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు
- ఏడాది తర్వాత అన్నీ మంచి రోజులే..

2లో

## బొల్లా బ్రహ్మనాయుడిపై మరో కేసు..

- వినుకొండలో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించినందుకు చర్యలు
- ర్యాలీ కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిందని ఆరోపణ
- భూకబ్జా కేసులో బెయిల్‌పై విడుదలైన కొద్ది రోజులకే ఈ ఘటన



2లో

## యోగా నాకు చాలా ఇచ్చింది

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ యోగాతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. యోగా తనకు లోతైన స్పష్టతను, అంతర్గత పరిపక్వతను అందించిందని, తన ప్రయాణాన్ని అది ఎంతగానో ప్రభావితం చేసిందని ఆదివారం ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో తన అభిప్రాయాలను పంచుకున్నారు. "భారత నాగరికతలో యోగా ఒక అంతర్భాగం. ప్రపంచానికి భారత్ అందించిన అద్భుతమైన బహుమతి ఇది. శారీరక ఆరోగ్యం, మానసిక స్పష్టత, అంతర్గత సమతుల్యతను యోగా ప్రోత్సహిస్తుంది. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలి" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. చిన్న వయసులోనే తాను యోగా ప్రయాణం ప్రారంభించానని ఆయన గుర్తుచేసుకున్నారు. "నా మదిలో ఎన్నో ప్రశ్నలతో సతమతమవుతున్న సమయంలో, యోగా నాకు సమాధానాలు ఇవ్వడమే కాకుండా, ప్రగాఢమైన స్పష్టతను, పరిపక్వతను ఇచ్చింది. నా ప్రయాణానికి సరైన మార్గాన్ని చూపింది. క్రియ యోగ, అష్టాంగ యోగ, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన సుదర్శన క్రియ వంటివి ఇప్పటికీ నా దినచర్యలో అంతర్భాగంగా కొనసాగుతున్నాయి" అని ఆయన వివరించారు. యోగాకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన కృషిని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలన్న మోదీ చొరవకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

**విశాఖలో ఘనంగా యోగా వేడుకలు**

మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విశాఖపట్నంలోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వి. అనిత పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ గణబాబు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఆమె యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆంధ్ర యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ జి.పి. రాజశేఖర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యోగా అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర సంఘాల సభ్యులు, సాధారణ పౌరులు, యువత ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఒప్పందానికి రాకపోతే ఖబడ్దార్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తమతో 60 రోజుల్లోగా తుది ఒప్పందం కుదుర్చుకోకపోతే హార్ముజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటామని, అక్కడ నౌకలపై సుంకాలు విధిస్తామని శనివారం తేల్చిచెప్పారు. ఇటీవల సంతకాలు జరిగిన అవగాహనా ఒప్పందం ప్రకారం.. హార్ముజ్ జలసంధిని ఇరాన్ బేషరతుగా తెరవాలని, రానున్న 60 రోజుల పాటు ఎలాంటి సుంకాలు లేకుండా నౌకల రాకపోకలకు వీలు కల్పించాలని వెల్లడించారు. "ఒకవేళ అమెరికా--ఇరాన్ మధ్య శాశ్వత ఒప్పందం కుదరని పక్షంలో.. 60 రోజుల గడువు ముగిసిన తర్వాత అమెరికా తరఫున విధిస్తే తప్ప హార్ముజ్‌లో ఎటువంటి సుంకాలు ఉండవు"అని స్పష్టంచేశారు. ఇరాన్ తమ దారికి రాకపోతే హార్ముజ్ వారి(ఇరాన్) ఆధీనంలో ఉండదని ట్రంప్ సంకేతాలిచ్చారు. మధ్యప్రాచ్య దేశాలకు సంరక్షణ సేవలు అందించినందుకు ఆ ఖర్చులను హార్ముజ్‌లో టోల్ ఫీజుల రూపంలో వసూలు చేసుకుంటామని వివరించారు.

**హెజ్‌బొల్లాను అదుపు చేయాలి**

లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూప్‌ను తక్షణమే అదుపు చేయాలని ఇరాన్‌కు ట్రంప్ తేల్చిచెప్పారు. లేకపోతే ఇరాన్‌పై మళ్లీ సైనిక చర్యకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ట్రూత్ సోషల్‌లో పోస్టుచేశారు. స్విట్జర్లాండ్‌లో అమెరికా--ఇరాన్ చర్చలు ప్రారంభమైన కొద్ది నిమిషాలకే ట్రంప్ ఈ హెచ్చరికలు చేయడం గమనార్హం. "ఇరాన్ అండదండలతో లెబనాన్‌లో ఇబ్బందులు సృష్టిస్తున్న మిలిటెంట్ గ్రూప్‌లను ఇరాన్ ప్రభుత్వం వెంటనే అదుపు చేయాలి. వారు(ఇరాన్) అందుకు అంగీకరించకపోతే గతవారం చేసినట్లే ఈసారి మరింత తీవ్రంగా ఇరాన్‌పై దాడి చేస్తాం" అని ట్రంప్ తేల్చిచెప్పారు.

## బొల్లా బ్రహ్మనాయుడిపై మరో కేసు..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారన్న ఆరోపణలతో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే, జూన్ 20వ తేదీన బొల్లా బ్రహ్మనాయుడు తన అనుచరులతో కలిసి నరసరావుపేట నుంచి వినుకొండకు భారీ కాన్వాయ్‌తో బయలుదేరారు. ఈ క్రమంలో వినుకొండ పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో రంగంలోకి దిగిన టౌన్ సీఐ ప్రభాకర్ రావు, కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులకు, వైసీపీ కార్యకర్తలకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు కాన్వాయ్‌ను బ్రాహ్మణపల్లి రోడ్డు మీదుగా మళ్లించారు. ఆ తర్వాత బొల్లా వినుకొండలో జరిగిన ఓ సభలో పాల్గొన్నారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో నమోదైన భూకబ్జా కేసులో కొద్ది రోజుల క్రితమే ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. గండిపేట పరిధిలో నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కుట్ర పన్నారన్న ఆరోపణలపై సైబరాబాద్ పోలీసులు ఆయన్ను తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. ఆ కేసులో బెయిల్ పొందిన కొద్ది రోజులకే ఇప్పుడు వినుకొండలో అనుమతి లేని ర్యాలీ నిర్వహించి మరో కేసులో చిక్కుకున్నారు. 2019 నుంచి 2024 వరకు వినుకొండ ఎమ్మెల్యేగా పనిచేసిన బ్రహ్మనాయుడు, ఎన్నికల్లో ఓటమి తర్వాత స్థానిక రాజకీయాల్లో చురుగ్గా ఉంటున్నారు. ఈ తాజా ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## భయపడకండి.. అండగా ఉంటాం

హనుమాన్‌నగర్ ప్రజలు మరో ఏడాది పాటు తమ ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కాపాడుకుంటే అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని..అప్పుడు బస్తీవాసులందరికీ ఇండ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. 60 ఏండ్ల నుంచి నివాసముంటున్న పేదల ఇండ్లను ఖాళీ చేయిస్తామంటే చూస్తూ ఊరుకోబమని అన్నారు. హనుమాన్ నగర్ ప్రజలకు నోటీసులు ఇస్తే.. 60 ఏండ్ల నుంచి నివసిస్తున్న ప్రజలను ఎలా ఖాళీ చేయిస్తారని కోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుందని తెలిసే నోటీసులు ఇవ్వలేదని చెప్పారు. అందుకే బస్తీ ప్రజల మధ్య చిచ్చులు పెట్టి కొంతమందిని తమవైపునకు తిప్పుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. బస్తీ ప్రజలంతా ఐకమత్యంగా ఉంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చినా ఒక్క ఇటుక కానీ.. ఇంటికి ఉన్న సున్నం కానీ ముట్టుకోలేరని భరోసా కల్పించారు.

# యోగాతో ప్రపంచ శాంతి

ఈ సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సమతుల్య వ్యక్తిగత జీవనశైలికి యోగా అవసరమని అన్నారు. అన్ని వయసుల వారు ఈ సంప్రదాయాన్ని ఆచరించవచ్చని సూచించారు. పని, పోషణ, నిద్రలతో కూడిన సమతుల్య జీవనశైలే దుఃఖాన్ని నిర్మూలించడానికి కీలకమని, ఇందుకు యోగా తోడ్పడుతుందని వెల్లడించారు. ఛాలామంది తమ ఆధునిక జీవనశైలిలో సమతుల్యతను కాపాడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. సమతుల్యమైన రీతిలో జీవించే విధానాన్ని యోగా మనకు నేర్పుతుందని, ఏం చేయాలి, ఏం చేయకూడదు అనే విషయాలను కూడా బోధిస్తుందని పేర్కొన్నారు. మన శరీరాన్ని సరైన స్థితిలో ఉంచుకోవడం నేర్చుకున్నప్పుడు, ఆరోగ్యం ఒక అలవాటుగా మారుతుందని వెల్లడించారు. యోగా అనేది మానసిక ఆరోగ్యం ద్వారా శారీరక దృఢత్వాన్ని సాధించడానికి మార్గం చూపుతుందని అన్నారు. యోగా అనేది వ్యక్తిగత జీవనశైలికే కాకుండా, ఈ ప్రపంచం మెరుగైన భవిష్యత్తుకు ఎంతో అవసరమని స్పష్టంచేశారు. సమతుల్యత, ఆత్మజ్ఞానం, అంతర్గత స్థిరత్వాన్ని యోగా పెంపొందిస్తుందని.. ఈ విలువలు సమాజంలో విభజనలు, సంఘర్షణను అంతం చేస్తాయని వ్యాఖ్యానించారు. యోగాను కేవలం ఒక నిర్దిష్ట రోజుకు లేదా ఒక కార్యక్రమానికి మాత్రమే పరిమితం చేయకూడదని ప్రతిజ్ఞ చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. యోగాను మన జీవితాల్లో, భావి తరాల జీవితాల్లోనూ ఒక భాగంగా చేసుకోవాలని తేల్చిచెప్పారు. వివిధ దేశాలు, సంస్కృతులకు చెందిన ప్రజలను ఏకం చేస్తూ, యోగా నేడు ప్రపంచంలోనే అతిపెద్ద సామూహిక వేడుకగా మారిందని మోదీ హర్షం వ్యక్తంచేశారు. భూమిపై అత్యంత సుదీర్ఘమైన రోజుగా నిలిచే జూన్ 21వ తేదీ ఇప్పుడు యోగా కారణంగా అతిపెద్ద సామూహిక వేడుకల దినంగా మారిందని పేర్కొన్నారు.

**వేలాది మందితో కలిసి యోగాసనాలు**

కోల్‌కతాలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని మోదీ వేలాది మందితో కలిసి యోగాసనాలు వేశారు. తెల్ల రంగు టీ--షర్టు, ప్యాంట్ ధరించిన మోదీ ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే అభ్యాసకుల యోగాసనాలను నిశితంగా గమనించారు. కొన్ని సూచనలు జారీ చేశారు. ఈ వేడుకల్లో వృద్ధులు, చిన్నారులు సహా అన్ని వయసుల వారు పాల్గొన్నారు.

**టోక్యో నుంచి న్యూయార్క్ దాకా..**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని, యోగాసనాలు వేశారు. ఆరోగ్యం, సమతుల్యత, శ్రేయస్సుకు యోగా ఒక చక్కని మార్గమని వీరంతా చాటారు. జపాన్ రాజధాని టోక్యోలోని చారిత్రక ఆలయాల దగ్గర్నుంచి న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ వరకు ఇందుకు వేదికలుగా మారాయి. ఈ ఏడాది ఆరోగ్యకరమైన వృద్ధాప్యం ఇతివృత్తంతో కార్యక్రమాలు జరుగుతున్నాయి. చైనాలోని షాంఘై నగరంలో భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం చేపట్టిన కార్యక్రమానికి 400 మంది హాజరయ్యారు.

## పై కుట్ర చేయాల్సిన అవసరం పార్టీలో ఎవరికీ లేదు

మీడియాతో మాట్లాడారు. "మధ్యప్రదేశ్‌లో 3 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మెజార్టీ లేకపోయినా ఫౌల్ గేమ్ ప్లాన్‌తోనే భాజపా మూడో అభ్యర్థిని బరిలో దింపింది. డబ్బులు, బెదిరింపులతో మూడో స్థానం గెలవలేమని భాజపా చివర్లో గ్రహించింది. నా నామినేషన్ ఆమోదం విషయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎలక్షన్ కమిషన్ భాజపాతో రాజీపడ్డాయి. ఆ కేసులో నాకు నోటీసిచ్చిన సమాచారం తెలంగాణలో ఎవరైనా ఎందుకు లీక్ చేస్తారు?. ఆర్ఓ భాజపాతో రాజీపడి నా నామినేషన్‌ను తిరస్కరించారు. నాపై కుట్ర చేశారనే వదంతులు నామినేషన్ తిరస్కరణకు ఒకరోజు ముందు నుంచే భాజపా ప్రచారం చేసింది.తెలంగాణలో ఎవరూ నా కోసం రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడం లేదు. ఎవరో నా కోసం రాజీనామా చేస్తున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదు. నా రాజకీయం మధ్యప్రదేశ్‌లో ఉంటుంది. ప్రస్తుతం పదవిలో ఉన్న రాజ్యసభ సభ్యుడిని రాజీనామా చేయించి ఆ స్థానం తీసుకునే అవసరం నాకు లేదు. నాపై క్రిమినల్ కేసులు లేవు. కేవలం నోటీసు ఇచ్చారు. నామినేషన్‌లో ఇలాంటి కేసుల వివరాలు తెలపాల్సిన అవసరం లేదు. ఆ కేసు నేను తెలంగాణ రాష్ట్రానికి ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా వెళ్లకముందుదని ఆర్ఓకు చెప్పాను. కుంభం శివకుమార్‌పై వచ్చిన ఫిర్యాదు అంశం సీరియస్ అని గ్రహించే ఆయనకు ఎన్నికల్లో నారాయణపేట టికెట్ ఇవ్వలేదు. అయినా ఇప్పటివరకూ ఆ కేసులో ఏమీ రుజువుకాలేదు. ఒక వ్యక్తిపై అభియోగాలుంటే కుటుంబంలోని వారికి టికెట్ ఇవ్వకూడదని ఎక్కడా లేదు. నా నామినేషన్ తిరస్కరణ విషయంలో మేం ఒక్క నిమిషం కూడా నిరాశ చెందలేదు. భాజపా ఎలాంటి రాజకీయం చేసిందో దేశానికి చూపించాం. ఓటు చోరీ, సీటు చోరీ జరుగుతోందని రెండేళ్ల నుంచి రాహుల్ గాంధీ చెబుతున్నారు" అని మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు.



## భారత నౌకాదళానికి కొత్త బలం

భారత నౌకాదళ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడు కీలక స్వదేశీ నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌లను నౌకాదళంలోకి అధికారికంగా ప్రవేశపెట్టారు. కోల్‌కతాలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఐఎన్ఎస్ అగ్రయ్, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ దునగిరి నౌకలను భారత నౌకాదళానికి అంకితం చేశారు. ఈ మూడు నౌకలు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించి, నిర్మించినవిగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. వీటి చేరికతో భారత నౌకాదళం కార్యాచరణ, పర్యవేక్షణ, రక్షణ సామర్థ్యాలు మరింత బలపడనున్నాయి. సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, ఈ మూడు నౌకలు భారతదేశ ఆధునికత, ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాసానికి ప్రతీకలని పేర్కొన్నారు. రక్షణ రంగంలో దేశం స్వావలంబన దిశగా వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు. ఎన్ఎస్ సంశోధక్ ఒక అత్యాధునిక హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌక. సముద్రగర్భ మ్యాపింగ్, హైడ్రోగ్రాఫిక్ సర్వేలు నిర్వహించడం, సురక్షిత నౌకాయాన మార్గాలను గుర్తించడం, సముద్ర శాస్త్ర సమాచారాన్ని సేకరించడం దీని ప్రధాన బాధ్యతలు. అదనంగా, మానవతా సహాయం, విపత్తు నిర్వహణ సమయంలో ఈ నౌక తేలియాడే వైద్య కేంద్రంగా కూడా సేవలందించగలదు. ఐఎన్ఎస్ అగ్రయ్ ఒక అధునాతన యాంటీ-సబ్‌మరైన్ వార్‌ఫేర్ (ఋూఔ) షాలో వాటర్ క్రాఫ్ట్. తీర ప్రాంతాలు, నిస్సార జలాల్లో శత్రు జలాంతర్గాములను గుర్తించడం, ట్రాక్ చేయడం, అవసరమైతే వాటిని ధ్వంసం చేయడం దీని ప్రధాన విధి. ఈ నౌకలో ఆధునిక సోనార్ వ్యవస్థలు, యాంటీ సబ్‌మరైన్ రాకెట్లు, టార్పెడోలు, 30 మి.మీ నావికా గన్ మైన్లు అమర్చే సామర్థ్యం వంటి అధునాతన రక్షణ వ్యవస్థలు ఉన్నాయి.

**ఐఎన్ఎస్ దునగిరి ప్రత్యేకతలు**

ఐఎన్ఎస్ దునగిరి, ప్రాజెక్ట్ 17ూా కింద నిర్మించిన నీలగిరి తరగతి స్టెల్త్ గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్. ఇది భారత నౌకాదళంలో అత్యాధునిక యుద్ధనౌకలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ నౌకలో బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులు, బరాక్-8 వాయు రక్షణ క్షిపణి వ్యవస్థ, టార్పెడోలు, ఆధునిక రాడార్, యుద్ధ వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. వాయు రక్షణ, ఉపరితల యుద్ధం, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ కార్యకలాపాలను ఒకేసారి నిర్వహించే సామర్థ్యం దీనికి ఉంది.

**ఆత్మనిర్భర్ భారత్‌కు నిదర్శనం**

కోల్‌కతాకు చెందిన నిర్మించిన ఈ మూడు నౌకలు 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. రక్షణ రంగ తయారీలో భారతదేశం సాధిస్తున్న స్వావలంబనకు ఇవి ప్రతీకలుగా నిలుస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ మూడు నౌకల చేరికతో భారత నౌకాదళం కార్యాచరణ సామర్థ్యాలు, సముద్ర భద్రతా వ్యవస్థలు మరింత బలోపేతం కానున్నాయి.


# ఆరోగ్య ఆంధ్రప్రదేశే లక్ష్యం..

తన చొరవతో ప్రపంచానికి భారతదేశ శక్తులను చాటుతూ, దేశాన్ని అగ్రభాగాన నిలబెడుతున్నారని కొనియాడారు. సాంకేతికత, ఆధ్యాత్మికతల కలయికతోనే సమాజ భవిష్యత్తు ముడిపడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆధ్యాత్మికత, యోగా సాధన ద్వారానే హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ (సుఖీభవ ఏపీ) సాధ్యమవుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో విశాఖపట్నంలో 'యోగాంధ్ర-2025' పేరిట భారీ ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రధాని మోదీ సమక్షంలో గిన్నిస్ బుక్, ప్రపంచ రికార్డులను సృష్టించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా వేడుకలను పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల కేంద్రాలలో కోటి మందికి పైగా ప్రజలు యోగా సాధన చేస్తున్నారని, ఈ సంస్కృతిని ఇంటింటికీ చేర్చి ప్రజారోగ్యాన్ని కాపాడటమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో బాబా రామ్‌దేవ్ చేసిన అమోఘమైన కృషిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. రాష్ట్రంలో యోగా కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తామని, స్టాండర్డ్ యోగా ప్రొటోకాల్స్ రూపొందించడానికి ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేస్తామని చంద్రబాబు వెల్లడించారు. ఇందుకోసం 'యోగాంధ్ర' పేరిట ప్రత్యేక డిజిటల్ పోర్టల్‌ను కూడా తీసుకురానున్నారు. అలాగే, రాష్ట్రంలోని




స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో శాశ్వత యోగా మందిరాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్‌లను పూర్తిగా దూరంగా పెట్టాలని, రసాయన రహిత ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా అనారోగ్యాలను దరిచేరనివ్వకుండా చూసుకోవచ్చని హితవు పలికారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని (గ్రీన్ కవర్) 50 శాతానికి పెంచుతామని చెబుతూ.. రాబోయే ఆగస్టు 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా వైద్య నిపుణులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు యోగాను కూడా అందులో భాగం చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు ఒక గంట పాటు యోగా, ధ్యానం, ప్రాణాయామంకు కేటాయిస్తే అసలు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరమే రాదని చంద్రబాబు పేర్కొన్నారు.

అనంతరం వ్యసన ముక్త భారత ప్రచార యాత్ర వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. నగర వాసులు పెద్ద ఎత్తున యోగా కార్యక్రమానికి హాజరయ్యారు.



## యువత స్వయం ఉపాధితో రాణించాలి

- ఆదిత్య డయాగ్నొస్టిక్ సెంటర్‌కు రూ. 20 వేల ఆర్థిక సాయం
- ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్

**తొలివెలుగు, చౌటుప్పల్:** యువత కేవలం ఉద్యోగాలపైనే ఆధారపడకుండా, స్వయం ఉపాధి రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇరుగదిండ్ల భాస్కర్ ఆకాంక్షించారు. చౌటుప్పల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆదిత్య డయాగ్నొస్టిక్ సెంటర్'ను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లోని వైద్య పరికరాలు, సదుపాయాలను పరిశీలించడమే కాకుండా, స్వయంగా రక్త పరీక్షలు చేయించుకున్నారు. స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకుని కేంద్రాన్ని ప్రారంభించిన యువ నిర్వాహకులను ఆయన అభినందించారు. వారి వ్యాపార వృద్ధి కోసం ఫౌండేషన్ తరపున రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని నిర్వాహకులకు అందజేశారు. యువత ఏ రంగంలో ఉన్నా అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కౌన్సిలర్ బుడ్డా సురేష్, ఫౌండేషన్ డైరెక్టర్ ఇఎల్‌వి అశోక్, ఫౌండేషన్ సభ్యులు కిరణ్, మార్గం శివకృష్ణ యాదవ్, నోముల సత్తిరెడ్డి, బత్తుల దాసు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

- హైకోర్టు ప్రతిపాదనకు ప్రభుత్వం నుంచి ఆర్థిక అనుమతులు
- చౌటుప్పల్‌కు అదనపు జూనియర్ సివిల్ కోర్టు మంజూరు
- ప్రభుత్వంతో చర్చించి ఆర్థిక అనుమతులు సాధించిన ఎమ్మెల్యే
- ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి



**తొలివెలుగు, చౌటుప్పల్:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కృషి ఫలితంగానే చౌటుప్పల్‌కు అదనపు జూనియర్ సివిల్ కోర్టు మంజూరైందని చౌటుప్పల్ కోర్టు ప్రభుత్వ న్యాయవాది వాకిటి నరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చౌటుప్పల్ కోర్టు పరిధిలో కేసుల సంఖ్య అధికంగా ఉండడంతో అదనపు కోర్టు అవసరం ఉందని, ఈ మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలుమార్లు హైకోర్టును కోరినట్లు తెలిపారు. న్యాయవాదుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ఫిబ్రవరి-2025లో చౌటుప్పల్‌లో అదనపు కోర్టు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందన్నారు. అయితే దాదాపు ఏడాదిన్నర పాటు ఆర్థిక అనుమతుల కోసం ఈ ప్రతిపాదన పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి సంబంధిత మంత్రి, రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఆర్థిక అనుమతులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చౌటుప్పల్‌లో అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఏర్పాటు చేస్తూ శనివారం జీవో నెం.44ను జారీ చేసిందని తెలిపారు. గతంలో చౌటుప్పల్ కోర్టును సందర్శించిన సందర్భంగా అదనపు కోర్టు, సబ్ కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని కొనియాడారు. అదేవిధంగా సబ్ కోర్టు ఏర్పాటు అంశంపై కూడా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ న్యాయవాదులను వెంట తీసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చర్చించారని తెలిపారు. చౌటుప్పల్‌కు అదనపు కోర్టు మంజూరు చేయడంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వాకిటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. అదనపు కోర్టు ఏర్పాటుతో కేసుల సత్వర పరిష్కారంతో పాటు కక్షిదారులు, న్యాయవాదులకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఆపత్కాలంలో తోడుగా.. మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

- వెల్లంకిలో మానవత్వాన్ని చాటుకున్న 2012-13 పదో తరగతి బ్యాచ్
- రూ. 26 వేల నగదు అందజేత.. భవిష్యత్తుకు భరోసా

**తొలివెలుగు, రామన్నపేట:** స్నేహమంటే కేవలం కలిసి చదువుకోవడమే కాదని, ఆపత్కాలంలో ఆపన్న హస్తం అందించడమని చాటిచెప్పారు కొందరు పూర్వ విద్యార్థులు. రామన్నపేట మండల పరిధిలోని వెల్లంకి గ్రామానికి చెందిన జినుక అనిత భర్త శ్రవణ్ ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. భర్త మరణంతో తీవ్ర ఆవేదనలో ఉన్న అనిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ఆమెతో పాటు చదువుకున్న పదో తరగతి మిత్రులు ముందుకొచ్చారు. వెల్లంకి పాఠశాలలో 2012-13 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన సహధ్యాయులంతా ఒక గ్రూపుగా ఏర్పడి, తమ వంతుగా సేకరించిన రూ. 26,000ల ఆర్థిక సహాయాన్ని ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు అనితకు ధైర్యం చెబుతూ, భవిష్యత్తులోనూ తమ మిత్రుల బృందం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కష్టసమయంలో స్పందించి తోటి మిత్రురాలిని ఆదుకున్న పూర్వ విద్యార్థుల చొరవను గ్రామస్తులు, పలువురు ప్రముఖులు అభినందించారు.





## దివిస్ పరిశ్రమలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

- యోగ సాధనతోనే సంపూర్ణ ఆరోగ్యం: యోగా గురువు పాండు
- ఉత్సాహంగా పాల్గొన్న పరిశ్రమ అధికారులు, ఉద్యోగులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం దివిస్ పరిశ్రమలో యోగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. యోగా గురువు పాలకూరల పాండు ఆధ్వర్యంలో పరిశ్రమ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున యోగాసనాలు వేశారు. అనంతరం యోగా గురువు మాట్లాడుతూ.. ఉదయం నుండి సాయంత్రం వరకు నిరంతరం శ్రమించే పరిశ్రమ ఉద్యోగులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ యోగాను జీవనశైలిగా మార్చుకోవాలన్నారు. రోజూ ఉదయం కేవలం పది నిమిషాల పాటు యోగా సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఉల్లాసం లభిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు మేనేజర్ మురళీకృష్ణ, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ప్రొడక్షన్) నాగమల్లేశ్వరరావు, డీజీఎం డి.శ్రీనివాస్, ఏజీఎం శివప్రసాద్, సీనియర్ మేనేజర్ (ప్రొడక్షన్) ఏది రావు, ఏ.శ్రీధర్ రావుతో పాటు పెద్ద సంఖ్యలో పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు పాల్గొని యోగా సాధన చేశారు.



## కాపురానికి రావా.. అయితే టవర్ ఎక్కేస్తా!

- భార్య రాలేదని భర్త హైడ్రామా
- కోతులకు భయపడి ఒక టవర్ దిగి.. మరో టవర్ ఎక్కిన వైనం
- ఎస్ఐ భాస్కర్ రెడ్డి చాకచక్యంతో సద్దుమణిగిన వ్యవహారం

**తొలివెలుగు, చౌటుప్పల్/భూదాన్ పోచంపల్లి:** భార్య కాపురానికి రావడం లేదని అలిగిన ఓ భర్త.. ఏకంగా సెల్ టవర్లెక్కి స్థానికులను, పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. ఆదివారం పోచంపల్లిలో జరిగిన ఈ రెండు గంటల హైడ్రామా స్థానికంగా కలకలం రేపింది. స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన కరగల్ల బాలస్వామి (జేసీబీ డ్రైవర్), పెద్దగూడెంకు చెందిన బాలమణి ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. అయితే, బాలస్వామి మద్యానికి బానిసై రోజూ గొడవ పడుతుండటంతో.. విసిగిపోయిన భార్య వారం క్రితం పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ?దీన్ని తట్టుకోలేని బాలస్వామి ఆదివారం ఉదయం ప్రగతినగర్‌లోని జియో టవర్ ఎక్కి బెదిరించాడు. అయితే, టవర్ పైకి కోతులు రావడంతో భయంతో వణికిపోయి వెంటనే కిందకు దిగేశాడు. ఆ తర్వాత మద్యం తాగి 11 గంటల ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న మరో టవర్ ఎక్కాడు. తన భార్యను తెస్తేనే దిగుతానని, లేదంటే దూకేస్తానని హల్ చల్ చేశాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ భాస్కర్ రెడ్డి వెంటనే అక్కడికి చేరుకుని.. అతడి భార్యను రప్పించారు. కిందకు దిగాలని నచ్చజెప్పారు. అతను ఫుల్లుగా మద్యం మత్తులో





ఉండటంతో దిగలేకపోయాడు. దీంతో ఎస్సై చాకచక్యంగా ఇద్దరు యువకులను టవర్ పైకి పంపి బాలస్వామిని క్షేమంగా కిందకు దించారు. ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నందున టవర్లకు కంచెలు వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.





## సనాతన సంప్రదాయాలకు ప్రతీక యోగా

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- ఆసనాలు వేసిన భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్

**తొలివెలుగు, చౌటుప్పల్/భూదాన్ పోచంపల్లి:** భారతీయ సనాతన సంప్రదాయాలకు యోగా ప్రతీక అని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పోచంపల్లి పురపాలక కేంద్రంలోని పద్మశాలి సభా వేదిక వద్ద భాజపా పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన.. పార్టీ కార్యకర్తలు, ఆర్ఎస్ఎస్ సభ్యులతో కలిసి ఆసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. 5 వేల ఏళ్ల నాటి భారతీయ శాస్త్రజ్ఞులు అందించిన యోగా సంపూర్ణ ఆరోగ్యానికి దివ్యౌషధమన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని, నిండు నూరేళ్లు జీవిస్తారని తెలిపారు. కార్యక్రమంలో భాజపా మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి, భువనగిరి అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, కిసాన్ సెల్ కన్వీనర్ గంజి బసవలింగం, జిల్లా నాయకులు చెరుకు వెంకటేశం, పట్టణ ప్రధాన కార్యదర్శి రాముడి యాదిరెడ్డి, ఏల శ్రీనివాస్, మణికంఠ, సత్యనారాయణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## యోగాకు వయసుతో పనిలేదు!

- ఉత్సాహంగా ఆసనాలు వేసిన మసీదుగూడెం వృద్ధులు
- దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోండి: యోగ అభ్యాసకురాలు భారతమ్మ

**తొలివెలుగు, చౌటుప్పల్:** దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకుంటే శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా అభ్యాసకురాలు, మసీదుగూడెం వార్డు సభ్యురాలు గూడూరు భారతమ్మ అన్నారు. చౌటుప్పల్ మండలంలోని మసీదుగూడెం గ్రామంలో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలకు భారతమ్మ యోగాసనాలపై అవగాహన కల్పించి, వారితో అభ్యాసం చేయించారు. వయసు పైబడిన వారు సైతం ఎంతో ఓర్పు, ఉత్సాహంతో ఆసనాలు వేయడం అక్కడి వారిని ఆకట్టుకుంది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. యోగాకు పుట్టినిల్లు మన దేశమేనని సగర్వంగా చెప్పారు. వయసుతో నిమిత్తం లేకుండా ఎవరికి వారు తమకు అనువైన ఆసనాలు వేస్తూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఆమె కోరారు. ఆరోగ్యవంతమైన, ప్రశాంతమైన జీవనశైలికి యోగా ఎంతగానో దోహదపడుతుందని వివరించారు.



తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..





# ప్రభుత్వ విప్ వేముల వీరేశానికి కృతజ్ఞతలు

- సిమెంట్ ఫ్యాక్టరీ రద్దుపై కొమ్మాయిగూడెం సర్పంచ్ హర్షం
- లాజిస్టిక్ పార్క్, డ్రై పోర్టు ఏర్పాటుకు లేఖ విడుదల
- కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి

**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అదానీ అంబుజా సిమెంట్ కర్మాగారం ఏర్పాటును రద్దు చేయించి, దానికి బదులుగా లాజిస్టిక్ పార్క్, డ్రై పోర్టు మంజూరయ్యేలా చొరవ చూపిన ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశానికి కొమ్మాయిగూడెం సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ విప్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతాపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మల్లారెడ్డి మాట్లాడుతూ.. శనివారం భువనగిరి కలెక్టరేట్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం సమక్షంలో జరిగిన అఖిలపక్ష భేటీలో అదానీ యాజమాన్యం తమ సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతిపాదనను ఉపసంహరించుకుంటూ, ఇక్కడ లాజిస్టిక్ పార్క్, డ్రై పోర్టు ఏర్పాటు చేయనున్నట్లు లిఖితపూర్వకంగా లేఖ ఇవ్వడం శుభపరిణామన్నారు. రామన్నపేట ప్రాంత ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై ఉన్న ప్రేమతో ఎమ్మెల్యే వీరేశం ప్రత్యేక చొరవ చూపి ఫ్యాక్టరీని అడ్డుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మోటే మారయ్య, ఉపసర్పంచ్ తీర్పాల ఐలయ్య, ఎర్ర శేఖర్, బాలగోని గణేష్, వార్డు సభ్యులు అంబాల అశోక్, వీరమళ్ళ లింగస్వామి, బోయపల్లి శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నాయకులు గురిజాల మహేష్ రెడ్డి, కల్లూరి శివకుమార్, వీరమళ్ళ పరశురామ్, ఆకిటి శివ తదితరులు పాల్గొన్నారు.

# గుండేపూడిలో పోలీసుల తనిఖీలు: నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

- కార్డన్ అండ్ సెర్చ్‌లో 12 కిలోల బీటీ-3 విత్తనాలు లభ్యం
- నకిలీలు విక్రయిస్తే కఠిన చర్యలు: పోలీసులు హెచ్చరిక






**తొలివెలుగు, మరిపెడ:** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శభరిష్ ఆదేశాల మేరకు తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్ సూచనలతో మరిపెడ పోలీసులు గుండేపూడి గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా గ్రామంలో చట్టవిరుద్ధంగా నిల్వ ఉంచిన 12 కిలోల నకిలీ బీటీ-3 పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో గ్రామాన్ని దిగ్బంధించిన పోలీసు బలగాలు ఇంటింటినీ క్షుణ్ణంగా సోదా చేశాయి. ఈ సందర్భంగా పలువురు అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రభుత్వ నిషేధిత, నకిలీ బీటీ-3 పత్తి విత్తనాలను విక్రయించి రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ విస్తృత తనిఖీల్లో మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్, మరిపెడ ఎస్సై గండ్రాతి సతీష్, సిరోల్ ఎస్సై గండ్ర సంతోష్, చిన్నగూడూరు ఎస్సై కుశకుమార్, ఎస్సైలు మహబూబి, ప్రభాకర్ రెడ్డి, అధిక సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్రం కృష్ణారెడ్డి పార్థివదేహానికి ఎమ్మెల్యే కుంభం అనిల్ నివాళి

- రెడ్ల రేపాకలో బాధిత కుటుంబానికి పరామర్శ
- లక్ష్మారెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది



**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుర్రం లక్ష్మారెడ్డి తండ్రి గుర్రం కృష్ణారెడ్డి (రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం) నివాసానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదివారం విచ్చేశారు. కృష్ణారెడ్డి పార్థివదేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతుడి అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదవశాత్తు కుటుంబ పెద్దను కోల్పోవడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో గుర్రం లక్ష్మారెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# యోగాతోనే ఒత్తిడికి చెక్.. జూనియర్ కాలేజీలో అంతర్జాతీయ యోగా డే!

- ఘనంగా ఆసనాలు వేసిన విద్యార్థులు, నాయకులు
- నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలి: నకిరేకంటి మొగులయ్య, సర్పంచ్ సత్యనారాయణ



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యోగా గురువు బొడ్డుపెల్లి సైదులు, బీజేపీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నకిరేకంటి మొగులయ్య, రామన్నపేట సర్పంచ్ గరిక సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా విద్య మానవాళి శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని వారు పేర్కొన్నారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల ఎన్నో రకాల దీర్ఘకాలిక వ్యాధులను నివారించుకోవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల్లో ఒత్తిడిని దూరం చేసి, మానసిక వికాసం పెంపొందించడానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. రానున్న రోజుల్లో యోగాను క్రీడా పోటీలుగా మలిచి విద్యార్థులు రాణించే అవకాశం ఉందన్నారు. ఎందరో ఋషులు, యోగులు అందించిన ఈ అపురూప విద్యను ప్రతి ఒక్కరూ దినచర్యగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వనం అంజయ్య, మండల ఇన్‌చార్జి కొరివి శంకర్, మిరియాల మల్లేష్, దావూరి వెంకటేష్, కట్ట యాదయ్య, మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, నాయకులు బట్టే రమేష్, నరసింహ, పొట్టబత్తుల వెంకన్న, గోపగోని అశోక్, ఏనూతుల సురేష్, మేడి పరశురాం, చిన్నపాక స్వామి, వీరమల్ల గణేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసనాలతో ఆరోగ్యం.. ధ్యానంతో ప్రశాంతత

- పైలాన్ పార్క్‌లో పండుగలా యోగా దినోత్సవం
- ఉత్సాహంగా పాల్గొన్న యోగా సాధకులు
- యోగా ప్రాముఖ్యతను వివరించిన డాక్టర్ రోజ్ మేరీ



**తొలివెలుగు, చౌటుప్పల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని పైలాన్ పార్క్‌లో ఆదివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యునాని వైద్యాధికారి డాక్టర్ రోజ్ మేరీ హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. నిత్యం యోగా, ధ్యానం సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవంలో పాల్గొన్న వారికి వివిధ రకాల యోగాసనాలు, ధ్యానం చేసే పద్ధతులను నేర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ ప్రకృతి వైద్యశాల యోగ శిక్షకురాలు అశ్విని, విశ్రాంత సామాజిక ఆరోగ్య అధికారి శ్రీరాములు, యోగ సాధకులు పాలకూర్ల సాత్విక్ గౌడ్, వీ. ఝాన్సీ, పట్టణ ప్రజలు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చమ్మ కుటుంబానికి సర్పంచ్ 'చేయూత'



- బేగంపేటలో బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేత
- కష్టకాలంలో అండగా నిలిచిన గ్రామ పాలకవర్గం

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల పరిధిలోని బేగంపేట గ్రామానికి చెందిన కొత్తపల్లి బుచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో శోకసంద్రంలో ఉన్న బాధిత కుటుంబాన్ని బేగంపేట గ్రామ సర్పంచ్ ఇండ్ల అనుష సుమన్ ఆదివారం పరామర్శించారు. అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో మృతురాలి కుటుంబ సహాయార్థం 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడం బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. కష్టకాలంలో ఉన్న ఆ కుటుంబానికి గ్రామస్తులంతా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోట సత్తయ్య, వార్డు సభ్యులు జిల్లా భాస్కర్, ప్యాట నరేష్, చిగుర్ల గణేష్, చింతగారి రమేష్, కొత్తపల్లి ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.



# కూలీల పక్షపాతి 'మహేందర్' అమర్ రహే!


- ఘనంగా సీపీఎం నేత ఐదో వర్ధంతి సంస్మరణ
- దళిత, పేద ప్రజల సమస్యలపై సాగిన ఆయన పోరాటాలు అజరామరం
- ప్రజా ఉద్యమాలలో వారి పాత్ర స్మరణీయం: మద్దెల రాజయ్య

**తొలివెలుగు, వలిగొండ:** సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, వలిగొండ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేముల మహేందర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య అన్నారు. ఆదివారం వలిగొండ మండల కేంద్రంలో వేముల మహేందర్ ఐదవ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మద్దెల రాజయ్య మాట్లాడుతూ.. వలిగొండ మండలంలో ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించడంలో మహేందర్ పాత్ర మరవలేనిదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా, కేవీపీఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యదర్శిగా దళిత, పేద కూలీల సమస్యలపై ఆయన నిరంతరం పోరాడారని కొనియాడారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు, ఆయా వర్గాల ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గణపతి రెడ్డి, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూర శ్రీనివాస్, తుర్కపల్లి సురేందర్, వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు దుబ్బ లింగం, నాయకులు నానాచర్ల రమేష్, కొండూరు సత్తయ్య గౌడ్, శీలం ఇందిర, మారబోయిన నరసింహ, వేముల నాగరాజు, వరికుప్పల యాదయ్య, వేముల లక్ష్మయ్య, పాలకుంట్ల నరసింహ, దొడ్డి యాదగిరి, ఈర్ల రమేష్, ఇస్తారి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# గోకారం పాఠశాలలో ఘనంగా యోగా దినోత్సవం

- ఆధునిక జీవనశైలిలో యోగా అంతర్భాగం కావాలి: పాశం భాస్కర్
- ఉత్సాహంగా ఆసనాలు వేసిన గ్రామ ప్రజలు, బీజేపీ శ్రేణులు

**తొలివెలుగు, వలిగొండ/చౌటుప్పల్:** అంతర్జాతీయ యోగా దినోత్సవ పుష్కర వైభవాన్ని పురస్కరించుకుని వలిగొండ మండల పరిధిలోని గోకారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం యోగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. యోగా శిక్షకుడు రాధారపు మల్లేశం పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు పాశం భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి ఆధునిక ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ఒక అంతర్భాగం కావాలని పిలుపునిచ్చారు. శారీరక, మానసిక దారుఢ్యానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ దీనిని తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షకుడి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, గ్రామస్థులు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, కనతాల అశోక్ రెడ్డి, మైసొల్ల రామనర్సు, మంద నరసింహ, కందుల తానేష్, మందుల నాగరాజు, గంగాధరి దయాకర్, బైరు మల్లేశం, సైదులు రెడ్డి, కట్ట దానయ్య, బూత్ అధ్యక్షులు రమేష్, కృష్ణ, చెరుక దానయ్య పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




## అలా అంటే కుదరదు కదా!

"నా సినీ ప్రయాణంలో ప్రేమకథలు చాలానే ఉన్నాయి. కానీ ఓ నటిగా నాకు 'తెలుసు కదా' ఇచ్చిన అనుభవం వేరు" అన్నారు కథానాయిక రాశీ ఖన్నా. యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డతో కలిసి ఆమె నటించిన చిత్రమే 'తెలుసు కదా'. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. నీరజ కోన దర్శకులుగా పరిచయం అవుతున్నారు. టి.జి.విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 17న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా రాశీఖన్నా శనివారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... "నేను ఇప్పటివరకూ తెరపై చూడని ఓ సరికొత్త కథాంశంతో రూపొందిన సినిమానే... 'తెలుసు కదా'. ముక్కోణపు ప్రేమకథే. అయినా ఇందులో ఒక విభిన్నమైన అంశం ఉంది. అదేమిటో తెరపైనే చూసి ఆస్వాదించాలి. నీరజ ఈ కథ చెప్పినప్పుడే నేను చాలా ఆశ్చర్యపోయా. పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో నాకు ఇది రెండో చిత్రం. సినిమాకి ఏది కావాలో అది పక్కాగా సమకూర్చే నిర్మాత టి.జి.విశ్వప్రసాద్. చిత్ర పరిశ్రమలో ఏదైనా సరే, దానంతట అదే జరగాల్సిందే. మనం ప్రణాళిక వేసుకున్నంత మాత్రాన అలాగే జరుగుతుందని లేదు. నా దగ్గరికి వచ్చిన కథల్లో ఏది బాగుందనిపిస్తే, వాటిని ఎంపిక చేసుకుని ప్రయాణం చేస్తుంటా. నాకు పురాణాల నేపథ్యంలో కథలంటే ఇష్టం, హారర్ నేపథ్యమున్న కథల్లో నటించడం అన్నా, చూడటం అన్నా ఎంతో ఇష్టం. అలాగని అలాంటి కథల్లోనే నేను నటిస్తానని కూర్చుంటే కుదరదు కదా. ఎప్పుడు ఏ పరిశ్రమలో సినిమాలు చేస్తానన్నది కూడా నా చేతుల్లో ఉండదు. తెలుగులో పవన్‌కల్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్' కోసం దర్శకుడు హరీష్‌శంకర్ ఫోన్ చేయగానే మరో మాట లేకుండా సినిమాకి అంగీకారం చెప్పా. ఆ తర్వాతే కథ విన్నా. పవన్‌కల్యాణ్‌తో కలిసి నటించడం గొప్ప అనుభవం.



## వాళ్లిద్దరికీ మాత్రం సిస్టర్ గా నటించలేను: సురేఖవాణి కుమార్తె సుప్రీత

సీనియర్ నటి సురేఖావాణి కుమార్తె సుప్రీత హీరోయిన్‌గా వెండితెరకు పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. తన తొలి చిత్రం 'అమరావతికి ఆహ్వానం' ప్రమోషన్లలో భాగంగా ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మంచి కథ వస్తే క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేయడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ఇద్దరు హీరోలకు మాత్రం మాత్రం చెల్లిగా నటించనని పేర్కొంది. "పవన్ కల్యాణ్, ఎన్టీఆర్ వంటి స్టార్లకు చెల్లిగా నటించే అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను. కానీ, విజయ్ దేవరకొండ, అఖిల్ అక్కినేనిలకు మాత్రం సిస్టర్ గా చేయను" అని సుప్రీత స్పష్టం చేసింది. వాళ్లిద్దరూ అంటే తనకు చాలా ఇష్టమని, టెన్త్ క్లాస్ పాసయితే అఖిల్ తో డిన్నర్ కు తీసుకెళతానని అమ్మ మాటిచ్చిందని సుప్రీత వెల్లడించింది. కానీ ఇంతవరకు అది నెరవేరలేదని విచారం వ్యక్తం చేసింది. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా విభిన్న పాత్రలు పోషించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపింది. సుప్రీత నటిస్తున్న 'అమరావతికి ఆహ్వానం' అనే హారర్ చిత్రం రానుంది. ఇదే ఇంటర్వ్యూలో తన జీవితంలో ఎదుర్కొన్న ఓ భయంకరమైన అనుభవాన్ని కూడా సుప్రీత పంచుకుంది. బరువు పెరిగావంటూ చుట్టూ ఉన్నవారు అనడంతో తీవ్రమైన ఒత్తిడికి గురయ్యానని, దాంతో బరువు తగ్గాలని తప్పుడు డైటింగ్ పద్ధతులు పాటించానని సుప్రీత భావోద్వేగంతో చెప్పింది. "ఒత్తిడి పెరిగినప్పుడల్లా ఇంకా ఎక్కువ తినేదాన్ని. దాంతో లావయ్యాను. వెంటనే బరువు తగ్గాలని నిర్ణయించుకుని, రోజుకు ఒక పూట మాత్రమే తినడం మొదలుపెట్టా.



## లక్‌కోసం ఎదురు చూస్తున్న కృతిశెట్టి

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం.కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.

## ప్రమాదం కారణంగా ఏడేళ్ల పాటు మంచానికే పరిమితమయ్యా: ముమైత్ ఖాన్

### మెదడులో నరాలకు దెబ్బ తగిలిందన్న ముమైత్

'ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే' అంటూ కుర్రకారును ఉర్రూతలూగించిన డ్యాన్సర్ ముమైత్ ఖాన్. తన డ్యాన్స్ తో ఒకప్పుడు టాలీవుడ్ ను ఆమె ఊపు ఊపింది. స్పెషల్ సాంగ్స్ చేస్తూ వెండితెరపై ఆమె తనదైన ముద్ర వేశారు. ఆ తర్వాత ఆమె సడన్ గా సినీ పరిశ్రమకు దూరమయ్యారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన వ్యక్తిగత విషయాలను పంచుకున్నారు. ఒక ప్రమాదం కారణంగా తాను చావు అంచుల వరకు వెళ్లానని తెలిపారు. ఆ ప్రమాదం కారణంగా తన జీవితం అతలాకుతలం అయిందని చెప్పారు. ప్రమాదం వల్ల మెదడులో నరాలకు దెబ్బ తగిలిందని... ఏడేళ్ల పాటు మంచానికే పరిమితం అయ్యానని తెలిపారు. డ్యాన్స్ కు దూరమయ్యానని చెప్పారు. ప్రమాదం నుంచి కోలుకోవడానికి మందులు వాడటంతో లావు అయ్యానని ముమైత్ తెలిపారు. ఆ సమయంలో తన తల్లి తనను కంటికి రెప్పలా చూసుకుందని చెప్పారు.

